సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం, 17, మే, 2024

పుల్‌కల్‌లో కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం





సంగారెడ్డి : ప్రధాన రహదారిపై పారుతున్న వర్షం నీటిలో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

గాలివాన బీభత్సం

జలమయమైన రోడ్లు
- కల్లాల్లో తడిసిన ధాన్యం
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

సంగారెడ్డి / పుల్‌కల్(అందోల్)/హత్నూర(సంగారెడ్డి) : సంగారెడ్డి పట్టణంలో గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమై వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై వాన నీరు చేరడంతో ట్రాఫిక్ జాం అయ్యింది. పుల్‌కల్ మండలంలో కురిసిన వర్షానికి రైతులు ఆగమాగమయ్యారు. పలు గ్రామాలలోని కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయ్యింది. టార్పాలిన్లు లేక రైతులు అవస్థలు పడ్డారు. వాన నీటిలో కొట్టుకుపోతున్న వడ్లను కాపాడుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అదేవిధంగా హత్నూర మండలంలో కురిసిన గాలివానకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. లింగాపూర్ గ్రామ శివారులో సుమారు 9 విద్యుత్ స్తంభాలు, చందాపూర్ గ్రామ శివారులో రెండు స్తంభాలు విరిగిపడ్డాయి. దౌల్తాబాద్, దేవులపల్లి, దౌలాపూర్ తదితర గ్రామాలలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.



హత్నూర మండలంలో నేలకూలిన విద్యుత్ స్తంభం

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్ : గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా అందించే నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి ఫిరంగి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాంలలో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందని పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ పొందాలనుకునే విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా http:overrear.triba.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు



పులిహోర, పండ్లతో స్వామివారి రూపం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర, యోగేశ్వర దేవస్థాన బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం నిత్యహోమం, వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, పల్లకీ ఉత్సవాన్ని చేపట్టారు. 50కిలోల పులిహోర, 12 రకాల పండ్లు, డ్రైఫ్రూట్స్‌లతో స్వామివారి రూపంలో అలంకరించి ప్రత్యేక అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న సత్యనారాయణ

మునిపల్లి(అందోల్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం మండలంలోని బుదేరా రైతు వేదికలో ఫర్టిలైజర్ షాపు డీలర్లు, నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. రైతు బంధు, రైతుబీమా, పంటల వివరాలు సేకరించాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు సూచించారు. డీలర్లందరూ లైసెన్స్‌లు ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలన్నారు. విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వాటిని అమ్మాలని సూచించారు. ఎస్‌ఐ సురేష్, డీలర్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కంది(సంగారెడ్డి): జాతీయ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై గురువారం కంది ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిటర్లు వారం రోజులుగా సామాజిక తనఖీ నిర్వహించి నివేదికలను తయారు చేశారు. ప్రజావేదికలో నివేదికలను చదివి వినిపించారు. రూ 2 కోట్లతో చేపట్టిన పనుల వివరాలను ప్రజావేదికలో పరిశీలించడం జరిగిందని డీఆర్డీఓ అడిషనల్ పీడీ బాల్‌రాజ్ తెలిపారు. ప్రజావేదికలోఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, విజలెన్స్ అధికారి నాగేశ్వర్ రావు, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ సుభాష్, డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెట్రోల్ నాణ్యత పరీక్షలు

ములుగు(గజ్వేల్): పెట్రోల్ నాణ్యత పరీక్షను గురువారం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) అధికారులు నిర్వహించారు. ములుగు గ్రామ రోడ్డుపై ఉన్న సరస్వతీ పెట్రోల్ బంక్‌లో నీటితో కూడిన కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారంటూ వినియోగదారులు బుధవారం ఆందోళన నిర్వహించి బంక్‌ను మూసివేయించారు. దీంతో బీపీసీఎల్ సిద్దిపేట సేల్స్ ఏరియా, నిజామాబాద్ టెరిటరీ ఫోర్‌కోట్ సేల్స్ అధికారి(ఎఫ్ఎస్ఏ) ప్రశాంత్, సేల్స్ అధికారి మన్‌వేందర్‌సింగ్‌లు పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. ఇక్కడి ఆయిల్‌ను పోలీసుల సమక్షంలో సేకరించి కెమికల్ ద్వారా పరీక్షలు నిర్వహించి ఎలాంటి కల్తీ లేదని నిర్ధారించారు.

కలిసొచ్చేది ఎవరికో?

'మెదక్' గెలుపు ఓటముల్లో మినీ ఇండియా కీలకం

- మొత్తం పోలైన ఓట్లలో 20 శాతం పటాన్‌చెరు నుంచే..
- విభిన్న వర్గాలకు చెందిన ఓటర్లున్న అసెంబ్లీ సెగ్మెంట్
- అంతుచిక్కని ఇక్కడి ఓటరు నాడి
- బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులూ ఇక్కడి వారే

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మెదక్ లోక్‌సభ అభ్యర్థుల గెలుపు ఓటములు నిర్ణయించడంలో పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్ కీలకంగా మారింది. మినీ ఇండియాగా పేరున్న ఈ సెగ్మెంట్‌లో అత్యధిక సంఖ్యలో ఓటింగ్ జరిగింది. దీంతో ఇక్కడ ఎవరికి ఎక్కువ మెజారిటీ వస్తే వారే విజయతీరాలకు చేరే అవకాశాలున్నాయి. నియోజకవర్గం పరిధిలో మొత్తం 18.28 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇందులో 13.72 లక్షల ఓట్లు పోలయ్యాయి. 75 శాతం పోలింగ్ నమోదైన విషయం విదితమే. అయితే పోలైన 13.72 లక్షల ఓట్లలో ఒక్క పటాన్‌చెరులోనే 2.60 లక్షల ఓట్లు పడ్డాయి. అంటే సుమారు 20 శాతం ఓట్లు ఈ ఒక్క అసెంబ్లీ సెగ్మెంట్‌లోనే ఉన్నాయి. మిగితా ఆరు అసెంబ్లీ స్థానాలకు కలిపి 80 శాతం ఓట్లు ఉన్నాయి.

అభ్యర్థుల ప్రత్యేక దృష్టి

ఈ కోణంలోనే బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు పెట్టారు. కులసంఘాలు, గేటెడ్ కమ్యూనిటీలతో సమావేశాలు నిర్వహించారు. మరోవైపు పోల్‌మేనేజ్‌మెంట్ విషయంలోనూ ఈ సెగ్మెంట్‌పై ఎక్కువ ఎఫర్ట్ పెట్టారు. ఇక్కడ పట్టు సాధిస్తే గెలుపు సులభమవుతుందని భావించి పటాన్‌చెరుపై ప్రత్యేక నజర్ పెట్టారు.



అంతుచిక్కని ఓటరు నాడి

ఈ సెగ్మెంట్‌లో భిన్నమైన ఓటర్లు ఉన్నారు. స్థానికులు, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఓటర్లు.. బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్ వంటి పబ్లిక్ సెక్టార్ రంగ సంస్థల ఉద్యోగులు.. పల్లె ప్రాంతాల ఓటర్లు.. జీహెచ్ఎంసీ పరిధిలోని ఓటర్లు.. అమీన్‌పూర్, తెల్లాపూర్ వంటి పట్టణాల్లో ఐటీ ఉద్యోగులు.. జిన్నారం, పటాన్‌చెరు మండలాల పరిధిలోని గ్రామాల రైతులు సైతం ఇక్కడే ఉన్నారు. ఇలా భిన్న వర్గాల ఓటర్లు ఇక్కడ ఉన్నారు. దీంతో ఈ సెగ్మెంట్‌లోని ఓటర్లు ఏ పార్టీకి వైపు మొగ్గు చూపారనే అంశంపై ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు ఏ పార్టీని ఆదరించారు..? ఐటీ ఉద్యోగులు ఎటు వైపు మొగ్గు చూపారు..? పబ్లిక్ సెక్టార్ సంస్థల ఉద్యోగులు ఏ పార్టీకి జై కొట్టారు..? స్థానిక ఓటర్లు ఎటువైపు ఉన్నారు..? ఇలా ఏ వర్గం ఏ పార్టీకి ఓట్లు పడ్డాయనే విషయంలో అభ్యర్థులు అంచనాకు రాలేకపోతున్నారు. మిగితా ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలోని ట్రెండ్ తెలిసినట్లుగా ఈ సెగ్మెంట్‌పై ఓ స్పష్టత రావడం లేదని రాజకీయ నేతలు పేర్కొంటున్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులూ ఇక్కడి వారే..

మెదక్ లోక్‌సభ స్థానంలో బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన వారే కావడం గమనార్హం. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులూ స్థానికులే. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ చిట్కుల్ గ్రామవాసి కాగా, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నివాసముంటున్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు దుబ్బాక నియోజకవర్గం బొప్పాపూర్ అయినప్పటికీ.. ఆయన పటాన్‌చెరు వాసిగానే గుర్తింపు ఉంది. ఈ ప్రాంతంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఇలా కీలకంగా మారిన మినీ ఇండియా ఏ పార్టీ అభ్యర్థికి మేలు చేసిందనే దానిపై కొనసాగుతున్న అంచనాలకు తెరపడాలంటే ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

ధాన్యాన్ని మిల్లులకు తరలించండి



కంది వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది(సంగారెడ్డి) : రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం కందిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కేంద్రాల్లో టార్పాలిన్లు ఉంచాలని తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు 315 మంది రైతుల నుంచి 3012 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. మిల్లుల వద్ద త్వరగా లారీల నుంచి అన్‌లోడ్ కాకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోతుందని తెలిపారు.

కౌంటింగ్ కు పకడ్బందీ ఏర్పాట్లు

పటాన్‌చెరు టౌన్ : స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉందని కలెక్టర్ క్రాంతి తెలిపారు. గురువారం మండల పరిధి రుద్రారంలో గీతం యూనివర్సిటీలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఈవీఎం సెక్యూరిటీ లాక్‌బుక్ రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రం వద్ద గట్టి నిఘా ఉంచాలని, ఐడీ కార్డు లేకుండా ఎవరినీ అనుమతించవద్దని ఆదేశించారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

పటాన్‌చెరు/ పటాన్‌చెరు టౌన్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. గురువారం మండల పరిధి కర్దనూర్, ఘనాపూర్, రుద్రారం ప్రభుత్వ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని వంట గదులు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులు నాణ్యతతో ఉండాలన్నారు. వాటిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా విద్యార్థులకు తాగునీరు అందేలా చూడాలన్నారు. పాఠశాలలకు ఎత్తైన ప్రహరీ నిర్మించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ట్రైనీ కలెక్టర్ మనోజ్, పంచాయతీ రాజ్ ఈఈ సురేష్, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ యాదగిరి, వ్యవసాయాధికారి ప్రసాద్, పీఏసీఎస్ సీఈఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1.16 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి హుండీ ఆదాయం 46 రోజులలో రూ. కోటి 16 లక్షల 51 వేల 672లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలాజీ తెలిపారు. గురువారం ఆలయ ముఖ మండపంలో హుండీలనూ జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ సేవసమితి సభ్యులు లెక్కించారు. నగదు రూ.1,16,51,672 , విదేశీ కరెన్సీ నోట్లు 18, మిశ్రమ బంగారం 70 గ్రాములు, మిశ్రమ వెండి 10 కిలోలు, పసుపు బియ్యం 23 క్వింటాళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నగదును స్థానిక బ్యాంక్‌లో జమ చేసినట్లు బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, శివరామ కృష్ణ సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బోరంచకు పోటెత్తిన భక్తులు



నారాయణఖేడ్: ప్రజల కొంగు బంగారంగా విలసిల్లుతున్న మనూరు మండలం బోరంచ నల్లపోచమ్మ జాతర గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్సవాల ప్రారంభ రోజు అమ్మవారికి ధ్వజారోహణం, స్వస్తి పుణ్యావచనం, పంచామృత అభిషేకం, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఒడిబియ్యం, పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. పొట్టేళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. ఏడువారాలపాటు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ అర్చకులు శ్రీకాంత్ స్వామి, నగేష్ స్వామి, సిద్ధు స్వామి తెలిపారు.



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు

సంగారెడ్డి/ జోగిపేట(అందోల్)/ నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు గురువారం బీఆర్ఎస్ శ్రేణులు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. అలాగే జోగిపేటలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. నారాయణఖేడ్ రాజీవ్ చౌక్ వద్ద రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కొనడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి మోసం చేసిందని ధ్వజమెత్తారు. కేవలం సన్నవడ్లకు మాత్రమే ఇస్తామనడం అన్యాయమన్నారు. పథకాలన్నీ ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తారన్న నమ్మకం లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో కొండల్‌రెడ్డి, మనోహర్ గౌడ్, వరలక్ష్మి, పాండు, వెంకటేశ్వర్లు, నాగభూషణం, రామాగౌడ్, లక్ష్మీకాంత్ రెడ్డి, పరమేశ్వర్, సంజీవరావు, నర్సింహారెడ్డి, విజయరామరాజు, అలీ, నవాబ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఖేడ్‌లో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



జోగిపేటలో రహదారిపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



సంగారెడ్డి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే సాయిరమాదేవి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం సిద్దిపేట జిల్లా జైలును ఆమె గురువారం సందర్శించారు. ఖైదీల వంట గది, స్టోర్ రూమ్, టాయిలెట్స్, కేసుల వివరాలు, భోజన వసతుల గురించి జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వికాస్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలయ్య, శ్రీకర్‌రెడ్డి, వెంకటేష్, కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సూర్యనారాయణ మూర్తి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యం రూ. 5,415 కోట్లు

గతేడాదితో పోలిస్తే రూ.905 కోట్లు పెరుగుదల

జిల్లాలో పంట రుణాల వార్షిక ప్రణాళిక రూ.5,415 కోట్లతో సిద్ధమైంది. గతేడాదితో పోలిస్తే రూ.905 కోట్ల పెరుగుదల కనిపిస్తోంది. కానీ గతేడాది అనుకున్న రూ.4,510 కోట్ల లక్ష్యంలో 75.77 శాతం మాత్రమే ఇచ్చారు. అంటే రూ.3,418 కోట్లు మాత్రమే రుణాలు అందించారు. కోటి ఆశలతో వానాకాలం సీజన్‌కు సిద్ధమవుతున్న జిల్లా రైతాంగానికి రుణ వితరణ వేగంగా జరిగితేనే మేలు జరగనుంది. కీలకమైన ఈ అంశాన్ని ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంటుంది.

– గజ్వేల్

- ఏటా లక్ష్యానికి దూరంగా రుణ వితరణ
- ఈసారి తీరు మారితేనే రైతులకు మేలు
- ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు


సాగు కోసం దుక్కి దున్నుతున్న రైతు

జిల్లాలో 2,81,069 మంది రైతులు ఉండగా వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి ఈపేడాది(2024–25) రూ.5,415 కోట్లకుపైగా పంట రుణాలు ఇవ్వాలనేది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు ఆమోదం కూడా లభించింది. రెండు సీజన్లు కలుపుకొని ఈ రుణ వితరణ జరగనున్నది. గతే డాది రూ.4,510 కోట్లకు లక్ష్యంగా ఉండగా రెండు సీజన్లు కలుపుకొని రూ.3,418 కోట్లు అందించారు. ఈ సారి రుణ ప్రణాళికలో రూ.905 కోట్ల పెరుగుదల కనిపిస్తోంది. ఇదిలా ఉంటే వ్యవసాయానుబంధంగా ఉండే సూక్ష్మ చిన్న తరహా రంగాలకు, వాణిజ్య రంగాలకు మరో రూ.1,090 కోట్లను కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఈ రుణాలు రూ. 331.96 కోట్లు తగ్గాయి. ఈ రుణాల ద్వారా ఆయా రంగాలను బలోపేతం చేయడానికి నిర్ణయించారు. ఇందులో మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖ, గోదాముల నిర్మాణం, సాగునీటి వనరుల అభివృద్ధి, రైతు సొసైటీల అభివృద్ధి తదితర అంశాలున్నాయి. ఈ నేపథ్యంలో రుణాలు ఏ మేరకు అందుతాయేనని రైతులు ఎదురుచూస్తున్నారు.

5.80 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి 5.80 లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఈ క్రమంలోనే వరి సాగు 3.50 లక్షల ఎకరాలకు పైనే సాగులోకి రానుండగా, పత్తి సాగును 1.50 లక్షల ఎకరాల వరకు అంచనా వేస్తున్నారు. కంది సాగు 50 వేల ఎకరాలకు తీసుకురావాలని అనుకుంటున్నారు. దీంతోపాటు కూరగాయల సాగును సైతం 50 వేల ఎకరాలకుపైగా పెంచాలని నిర్ణయించారు. మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు సాగులోకి రానున్నాయి.

లక్ష్యం నెరవేరితేనే మేలు

రుణ ప్రణాళిక సక్రమంగా అమలైతేనే రైతులకు మేలు జరిగే అవకాశముంది. జిల్లాలో రైతు భరోసాతోపాటు పంటల పెట్టుబడి కోసం రుణాల పంపిణీ అత్యవసరం. కానీ కొన్నేళ్లుగా రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగక రైతుల రుణాలు రెన్యూవల్ కావడం లేదు. ఫలితంగా కొత్త రుణాల పంపిణీ ఆలస్యమవుతోంది. ప్రతీ సీజన్‌లోనూ రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రత్యేకించి కొన్ని బ్యాంకులు పంట రుణాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఏటా రుణ వితరణ లక్ష్యం తగ్గిపోతుంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈసారైనా ఈ పరిస్థితి లేకుండా చూడాలని రైతులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుల సంక్షేమానికి పెద్ద పీట

ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యంత ప్రాధాన్యతినిస్తున్నది. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రుణ వార్షిక ప్రణాళిక సిద్ధం చేయడం జరిగింది. గతేడాదితో పోలిస్తే ప్రణాళికను పెంచడం జరిగింది. సాగుకు సిద్ధమవుతున్న రైతులకు రుణ వితరణ కూడా కీలకం కాబట్టి ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. బ్యాంకర్లతో సంప్రదింపులు జరుపుతూ పంట రుణాలు సకాలంలో అందేలా చూస్తాం.

– సత్యజిత్, లీడ్ బ్యాంకు మేనేజర్


సిద్దిపేట పట్టణంలోని శ్రీనివాస్ థియేటర్

వినోదం

- నేటి నుంచి 10 రోజులపాటు సినిమా హాల్‌లు బంద్
- ఐపీఎల్ ప్రభావం, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడమే
- జిల్లాలో 10 సింగిల్ స్క్రీన్ థియేటర్లు, 250 మంది కార్మికులు


సిద్దిపేటలోని ఓ సినిమా హాల్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రేక్షకులకు మనో ఉల్లాసం కల్గించేది, మనసుకు ప్రశాంతాత కల్గించేవి చిత్రాలు. మిత్రులతో కలిసి సినిమా చూసే వారికి, అదే విధంగా ఆదివారం రాగానే కుటుంబంతో కలిసి ఫస్ట్‌షో సినిమా చూసి అటు నుంచే అటు హోటల్‌లో డిన్నర్ చేసి ప్రశాంతంగా ఇంటికి చేరుకునే వారికి సినిమా థియేటర్‌ల మూసివేత వార్త బాధ కల్గిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో నేటి నుంచి పది రోజుల పాటు సినిమా ప్రదర్శనలు నిలిపి వేయనున్నారు.

జిల్లాలో సిద్దిపేటలో 3 టాకీస్‌లు, గజ్వేల్‌లో 3 టాకీస్‌లు, హుస్నాబాద్‌లో 2, దుబ్బాకలో 1, చేర్యాలలో 1, మొత్తంగా 10 సినిమా థియేటర్లు ఉన్నాయి. ఈ థియేటర్లలో ప్రతి రోజూ నాలుగు షోలు ప్రదర్శిస్తారు. ముఖ్యంగా పెద్ద హీరోల సినిమాల ప్రదర్శన, ఆదివారం, పండుగల సమయాల్లో ఈ థియేటర్ల వద్ద జన సందోహం ఉండేది. కానీ ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. అలాగే, ఐపీఎల్ క్రికెట్ సీజన్ నడుస్తుండడంతో ప్రేక్షకులు థియేటర్లకు రావడమే మానేశారు. దీనికి తోడుగా కొత్త సినిమాలు విడుదలైన కొద్ది రోజులకే ఓటీటీలో వస్తుంది. దీంతో సగటు ప్రేక్షకుడు థియేటర్‌కు రాకుండా ఓటీటీలో చూద్దాములే అని సినిమా హాల్ వైపు చూడడం లేదు. ఈ క్రమంలో థియేటర్‌ల నిర్వాహకులకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్క సినిమా థియేటర్‌లో నిర్వాహకులతో పాటు 25 మంది పైగా కార్మికులు పని చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 10 థియేటర్ల పరిధిలో దాదాపుగా 250 మంది వరకు కార్మికులు ఉన్నారు. నేటి నుంచి సినిమా హాల్‌ల మూసివేతతో ఈ కార్మికులు రోడ్డున పడే అవకాశం ఉంది.

క్లుప్తంగా

చిరుత దాడిలో దూడ హతం

రామాయంపేట(మెదక్): మండలంలోని దంతేపల్లివద్ద బుధవా రం రాత్రి చిరుత దాడిలో దూడ హతమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నక్కిర్తి భూదవ్వ పశువులను రోజూ మాదిరిగానే గ్రామ శివారులో ఉన్న తన వ్యవసాయ భూమి వద్ద కట్టేశారు. రాత్రి పశువులపై దాడి చేసిన చిరుత దూడను హతమార్చింది. ఉదయం వెళ్లి చూడగా దూడ కళేబరం కనిపించింది. అటవీశాఖ అధికారులు ఘటనా స్థలిని సందర్శించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి


అంజయ్య (ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. కొండాపూర్ ఎస్సై హరీశ్ శంకర్ కథనం మేరకు.. సైదాపూర్ గ్రామానికి చెందిన పెద్దగొల్ల అంజయ్య (45) ఫంక్షన్ నిమిత్తం తన బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో అనంత సాగర్ గ్రామ శివారులోకి రాగానే బైక్ వేగంగా వచ్చి రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అదే రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి కుమారుడు సురేశ్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


ఎల్లం(ఫైల్)

నిజాంపేట(మెదక్): జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన గెరిగంటి ఎల్లయ్య(45) వ్యవసాయం చేస్తుంటాడు. పెట్టుబడి కోసం రూ.4 లక్షల అప్పులు చేశాడు. వాటిని తీర్చే అవకాశం లేక జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎదుట ఉన్న వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోలకే ఫోజులు

డెంగ్యూపై అవగాహన కల్పించని వైద్య సిబ్బంది


మీర్జాపూర్ ఆరోగ్య కేంద్రం ఎదుట ఫొటో దిగుతున్న వైద్య సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్: జాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని వైద్య సిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు తీసి వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. గురువారం మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మండల వైద్యాధికారిణి టీ.నిఖిత ఆధ్వర్యంలో ర్యాలీ తీసినట్లు ఫ్లెక్సీ పట్టుకొని సిబ్బంది ఫొటోకు ఫోజులు ఇచ్చారు. ర్యాలీ తీసింది లేదు.. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వానాకాలం తొలకరి వర్షాలకు సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా లాంటివి ప్రబలుతాయి. వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కారు బోల్తా



జిన్నారం(పటాన్‌చెరు): కారు బోల్తా పడిన ఘటన జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఖాజీపల్లి గ్రామానికి చెందిన జీవన్ కారులో ఖాజీపల్లికి వస్తున్నాడు. నారాయణ కాలేజీ నుంచి ఖాజీపల్లి మధ్యలో ఇటీవల సీసీ రోడ్డును వేయించారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో కారు అదుపుతప్పి సీసీ రోడ్డు నుంచి పక్కనే ఓ గుంతలో పడింది. ఈ ఘటనలో జీవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185076]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏఓ

- ఓ షాపు అనుమతికి రూ.30 వేలు డిమాండ్
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు



నగదుతో ఏఓ అనిల్‌కుమార్

నర్సాపూర్: లంచం తీసుకుంటుండగా మండల వ్యవసాయాధికారిని పట్టుకున్నట్లు ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ గురువారం తెలిపారు. అనంతరం స్థానిక రైతు వేదిక వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని సలూరాకు చెందిన వంగ నరేన్ నర్సాపూర్‌లో ఫర్టిలైజర్, విత్తనాల దుకాణం పెట్టేందుకు వ్యాపార లైసెన్సు కోసం ఏఓ వద్ద దరఖాస్తు చేశాడన్నారు. దీనికి స్థానిక మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ రూ.30 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడని పేర్కొన్నారు. దీంతో నరేన్ తమకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దరఖాస్తులో భాగంగా గురువారం రైతు వేదికలో అనిల్‌కుమార్ నరేన్ వద్ద రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకొని నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఓకు పరీక్షలన్నీ నిర్వహించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. తనతోపాటు ఇన్‌స్పెక్టర్లు రమేశ్, వెంకటరాజగౌడ్ పాల్గొన్నారని డీఎస్పీ సుదర్శన్ తెలిపారు.

అదృశ్యమైన యువతి.. శవమై తేలి

- రంగనాయక సాగర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యం
- హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ


మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడుతున్న సీఐ ఉపేందర్


అశ్విని (ఫైల్)

సిద్దిపేటకమాన్/చిన్నకోడూరు(సిద్దిపేట): ఇంటి నుంచి అదృశ్యమైన యువతి రంగనాయక సాగర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది శవమై తేలిన ఘటన బుధవారం రాత్రి సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం శంకర్‌నగర్‌కు చెందిన ఇరుగదిండ్ల అశ్విని (23) డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రీపేర్ అవుతుంది. డిగ్రీ చదివే సమయంలో రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన శనిగరం శ్రవణ్ అనే యువకుడితో ప్రేమలో పడింది. మీరు ఒప్పుకుంటే అతడిని పెళ్లి చేసుకుంటాననే అశ్విని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీనికి వారు ఒప్పుకోకపోగా అతడితో మాట్లాడొద్దని సూచించారు. ఈ క్రమంలో అశ్విని ఈ నెల 13వ తేదీన అమ్మమ్మ వాళ్లింటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అక్కడికీ వెళ్లక, ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో తల్లి రాజేశ్వరి అదే రోజు సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో తోర్నాలకు చెందిన శ్రావణ్‌పై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు. యువకుడిని పోలీసులు విచారించగా ఆ సమయంలో తాను ఇంటి వద్దే ఉన్నట్లు తెలిపాడు.

రంగనాయక్ సాగర్‌లో మృతదేహం..

రంగనాయక్ సాగర్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అదృశ్యమైన అశ్వినిగా గుర్తించి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని మా అమ్మాయి కనిపించడం లేదని నాలుగు రోజుల కిందట ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రావణ్ వేధింపులే అశ్విని మృతికి కారణమని తండ్రి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయమై సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ.. ఈ నెల 13న ఓ యువతి అదృశ్యం కేసు నమోదైందన్నారు. బుధవారం రాత్రి రంగనాయక సాగర్‌లో లభించిన మృతదేహాన్ని సదరు యువతిగా గుర్తించామన్నారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

మూడంతస్తుల నుంచి కూలిన స్లాబ్

- ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు
- బొల్లారంలో ఘటన
- రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఘటన


స్లాబ్ పడటంతో కూలిపోయిన రేకుల ఇల్లు

జయదేవ్ (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా స్లాబ్ కూలడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బొల్లారం సీఐ గంగాధర్, స్థానికుల కథనం మేరకు.. ఒడిషా గ్రామానికి చెందిన జయదేవ్ (50) భార్య సబిత, కుమారుడు రాకేశ్ బొల్లారంలోని లక్ష్మీనగర్‌లోని ఓ రేకుల ఇంట్లో నివాసం ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. వీరి ఇంటిని ఆనుకొని మూడంతస్తుల భవనం ఉంది. అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో మూడంతస్తుల భవనం స్లాబ్‌తోపాటు రెయిలింగ్ కూలింది. ఈ క్రమంలో మొదటి అంతస్తులో బాల్‌కానీ వద్ద ఉన్న దీపంకర్ దాస్ కాలుపై స్లాబు పడి కాలు విరిగింది. అక్కడి నుంచి కింద ఉన్న రేకుల ఇంటిపై పడడంతో అందులో నిద్రిస్తున్న జయదేవ్ అక్కడికక్కడే మృతి చెందగా, సబితకు తీవ్ర గాయాలు అయ్యాయి. కుమారుడు రాకేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం సబిత పరిస్థితి విషయంగా ఉంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు సమాచారాన్ని పోలీసులకు అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ గంగాధర్ తెలిపారు. స్థానిక నాయకులు ఆనంద్ కృష్ణారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి తదితరులు గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు.

స్లాబ్ ఎలా కూలింది?

బొల్లారం గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డికి చెందిన భవనంలో వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు అద్దెకు ఉంటున్నారు. ఈ భవనం ఆరేళ్ల కిందట నిర్మించారు. తగిన నాణ్యత లేకపోవటంతో భవనం స్లాబ్ కూలిందని స్థానికులు ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు నాణ్యత లేని భవనాలను పట్టించుకోకపోవటం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. స్లాబ్ ఎలా కూలిందనే విషయమై పోలీసులు టౌన్ ప్లానింగ్ అధికారులను నివేదిక కోరారు.

తీరిన నీటి కొరత


వాల్వు ఏర్పాటుచేస్తున్న ఏఈ శ్రీధర్

సాక్షి ఎఫెక్ట్..

వర్గల్(గజ్వేల్): తాగునీటి సమస్య పరిష్కారమైంది. వర్గల్ మండలం నెంటూరు ఎస్సీకాలనీలో తాగునీటి కొరత నెలకొందని గురువారం 'సాక్షి'లో 'తాగునీటి ఇబ్బందులు' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు మిషన్ భగీరథ గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శ్రీధర్ గురువారం ఎస్సీ కాలనీ సందర్శించారు. నీటి సరఫరాను సమీక్షించారు. మిషన్ భగీరథ పైపులైన్ వద్ద వాల్వు ఏర్పాటుచేశారు. భగీరథ నీరు సరఫరా కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ కిందపడి బాలుడు మృతి


కొల్చారం మండలంలో ఘటన



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

కొల్చారం(నర్సాపూర్): ట్రాక్టర్ ట్రాలీ కింద పడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన కొల్చారం మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పోతంశెట్టిపల్లి వడ్డెర కాలనీకి చెందిన బోసు శివలక్ష్మి–రమేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. ఓ భూతగాదా విషయమై అప్పాజీపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ మేరాజ్‌తో మాట్లాడేందుకు ఆయన ఇంటికి భార్యాభర్తలు ఇద్దరూ తమ రెండవ కుమారుడైన జస్వంత్(3)తోపాటు నెల పాపను తీసుకొని వెళ్లారు. అక్కడ వారు మాట్లాడుతుండగా జస్వంత్ ఇంటి ఆవరణలో ఉన్న ట్రాక్టర్ వద్దకు వెళ్లి ట్రాలీ కింద ఆడుకుంటున్నాడు. ఇది గమనించని మేరాజ్ కొడుకు సయ్యద్ భాష ట్రాక్టర్ ను రివర్స్ తీశాడు. ట్రాలీ కింద ఆడుకుంటున్న జస్వంత్ చక్రాల కింద పడి గాయాలు కావడంతో మెదక్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. దీంతో ఆగ్రహించిన బాలుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మృతదేహంతో మేరాజ్ ఇంటి ఆవరణలో ఆందోళన దిగారు. విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ ఘటనా స్థలానికి వెళ్లి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు అక్కడి నుండి కదలకపోవడంతో మెదక్ రూరల్ సీఐ కేశవులకు సమాచారం అందించారు. సీఐ అక్కడికి చేరుకొని న్యాయం చేస్తానని హామీ ఇచ్చాడు. బాలుడి మృతికి కారణమైన సయ్యద్ పాషా పై కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఒకరు.. కాపాడబోయి మరొకరు

- ఉసిరికపల్లిలో మహిళ, యువకుడు మృతి
- వీరిని రక్షించే క్రమంలో మరో యువతికి తీవ్ర గాయాలు
- ఇంటి బయట బట్టలు ఆరేస్తుండగా ఘటన


మాణెమ్మ (ఫైల్)


భానుప్రసాద్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతిచెందగా, మరొకరికి గాయాలైన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధి ఉసిరికపల్లి గ్రామంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నిరుడి మాణెమ్మ(45) బట్టలు ఉతికి అనంతరం ఇంటి బయట జీఏ వైరు దండెపై ఆరేస్తుంది. ఈ క్రమంలో కరెంట్ స్తంభం నుంచి ఇంటి మీటరుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తేలి అదే దండెంపై పడి ఉంది. ఇది గమనించని మాణెమ్మకు విద్యుత్ షాక్ తగిలింది. అక్కడే ఆరుబయట ఉన్న మరిది కొడుకు భానుప్రసాద్(19) గుర్తించి ఆమెను రక్షించేందుకు ప్రయత్నించగా అతడికి కరెంట్ షాక్ కొట్టింది. ఇద్దరినీ కాపాడే ప్రయత్నంలో మాణెమ్మ కూతురు శ్రీలత సైతం షాక్‌కు గురై కిందపడిపోయింది. ఇది గుర్తించిన గ్రామస్తుడు చాకలి గోపాల్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి విద్యుత్ నిలిపివేశాడు. వెంటనే ముగ్గురిని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మాణెమ్మ, భానుప్రసాద్ మృతి చెందినట్లు తెలిపారు. గాయాలైన శ్రీలతకు చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఎమ్మెల్యే సునీత పరామర్శ

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శి ఓదార్చారు. అండగా ఉంటామని అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఆమె వెంట జెడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు కృష్ణారావు, వీరేశ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

పిడుగుపాటుతో 10 మేకలు..


పాపన్నపేట (మెదక్): మృతి చెందిన మేకలు

పాపన్నపేట (మెదక్): పిడుగుపాటుతో 10 మేకలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఆరెపల్లిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మష్కరి హనుమంతు మేకలు తీసుకొని మేత కోసం గ్రామ శివారుకు వెళ్లాడు. మధ్యాహ్నం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. అదే సమయంలో పిడుగుపడటంతో పది మేకలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, ఈ ఘటనతో జీవనోపాధి కోల్పోయానని హనుమంతు వాపోయాడు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

తాటి చెట్టుపై మంటలు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి మధిర సార్లవాడలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపడింది. తాటి చెట్టుపై పిడుగు పడటంతో ఒక్కసారిగా రైతులు కంగుతిన్నారు. ఆ సమయంలో చెట్టు కిందట ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

గడ్డివాము దగ్ధం

హత్నూర(సంగారెడ్డి): పిడుగుపాటుతో గడ్డి వాము దగ్ధమైన ఘటన హత్నూర మండలంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సదుల్లా నగర్ గ్రామానికి చెందిన పుట్ల గారి లింగయ్య గడ్డి వాము 150 మోపులు దగ్ధమయ్యాయి.

ప్రగతి ధర్మారంలో ఆవు..

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు తోడు పిడుగుపడడంతో గ్రామానికి చెందిన జెల్ల యాదగిరికి చెందిన ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.